సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం । 19 । ఏప్రిల్ । 2025



బీసీల వాటా తేల్చాకే..

బీసీల వాటా తేల్చాకే ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రకటన ఇవ్వాలని తీన్మార్ మల్లన్న అన్నారు.

వివరాలు 10లో ►



సాగునీరు నిలిపివేత

జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వకు సాగునీటిని శుక్రవారం నిలిపివేశారు.

వివరాలు 10లో ►

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0 /21.6

ఉదయం, సాయంత్రం ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



కందనూలు: జిల్లావ్యాప్తంగా గుడ్ ఫ్రై డే **వేడుక**లను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో **జరు**పుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రం లోని సెంటినరీ ఎంబీ చర్చిలో గీతాలు ఆల పిస్తూ ఏసుక్రీస్తు మహిమను స్తుతించారు. అనంతరం ఏసుక్రీస్తు సిలువ వేయబడిన సమయంలో పలికిన మాటలను ఎంబీ చర్చి పెద్దలు వివరించారు. అనంతరం ఎంబీ చర్చి చైర్మన్ సంపత్‌కుమార్ అందరికీ శుభ శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం సుభాషిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు వారి సలహాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని ఆమె కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు కార్యక్రమం ఉంటుందని, ఫోన్ చేయదలచిన వారు సెల్ నం.99592 26292ను సంప్రదించాలని సూచించారు.

27న పంచముఖికి ప్రత్యేక బస్సులు

వనపర్తి టౌన్: జిల్లాకేంద్రం నుంచి పంచముఖికి ఈ నెల 27న ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి నుంచి 27న మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు పంచముఖికి చేరుతుందన్నారు. అక్కడ దర్శనం అనంతరం మంత్రాలయానికి వెళ్లి దర్శనం తర్వాత తిరిగి పంచముఖికి చేరుకొని అదే రోజు రాత్రి బస్సు బయలుదేరి మరుసటి రోజు వనపర్తికి చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి డెడ్‌లైన్

భూభారతిపై అవగాహన కల్పించేందుకు సిద్ధమైన ప్రభుత్వం

- 60 రోజుల్లో సమస్యలకు పరిష్కారం చూపేలా కొత్త రెవెన్యూ చట్టం
- సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు
- నేడు గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పర్యటించనున్న మంత్రి పొంగులేటి



సాక్షి, నాగర్‌కర్నూల్: భూ సమస్యలపై తీసుకువచ్చిన భూభారతి చట్టం–2025పై ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ధరణికి బదులుగా తీసుకువచ్చిన కొత్త రెవెన్యూ చట్టంపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు అవగాహన సదస్సులను నిర్వహిస్తోంది. గత రెవెన్యూ చట్టాలకు భిన్నంగా ఈసారి కొత్త చట్టంలో భూసమస్యల పరిష్కారానికి నిర్దేశిత గడువును విధించింది. భూరికార్డుల్లో తప్పుల సవరణ పరిష్కారం 60 రోజుల్లో పూర్తి కావాలని నిర్దేశించింది. వారసత్వ భూముల్లో హక్కుదారులను 30 రోజుల్లోగా నిర్ణయించాలని, లేకపోతే దరఖాస్తు ఆమోదించాల్సి ఉంటుందని పేర్కొంది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించేందుకు సైతం చర్యలు తీసుకోగా, ఇందుకోసం గరిష్ఠంగా 90 రోజుల గడువు విధించింది.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు..

పూర్వంలో గ్రామాల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా నిర్వహించినట్టుగా ఇకనుంచి గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డులను నిర్వహించనున్నారు. మ్యుటేషన్, రికార్డుల మార్పులు జరిగినప్పుడు వాటిని గ్రామ పహాణి, ప్రభుత్వ భూముల రిజిస్టర్‌లను మారుస్తారు. భూభారతి పోర్టల్‌లో దరఖాస్తుల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్ణయాలపై అభ్యంతరాలు ఉంటే అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. తహసీల్దార్ నిర్ణయంపై ఆర్డీఓకు, ఆర్డీఓ నిర్ణయంపై కలెక్టర్‌కు, కలెక్టర్ నిర్ణయంపై ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. ఈ అప్పీళ్లను 60 రోజుల్లోపు పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ చట్టం కింద ఎస్సీ, ఎస్టీ, మహిళలు, వికలాంగ రైతులకు ఉచిత న్యాయసాయాన్ని అందించనున్నారు. మండలస్థాయి, జిల్లా లీగల్ అథారిటీల ఆధ్వర్యంలో పేద రైతులకు ఉచితంగా న్యాయ సహాయాన్ని అందించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన..



భూభారతి చట్టంపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు నిర్వహించే అవగాహన సదస్సునకు హాజరయ్యేందుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. జోగుళాంబ గద్వాలతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని సదస్సుల్లో పాల్గొంటారు. శనివారం ఉదయం 8.50 గంటలకు జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌కు హెలీకాప్టర్ ద్వారా చేరుకుంటారు. ధరూర్ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే భూ భారతి చట్టం –2025 అవగాహన సదస్సుల్లో పాల్గొంటారు. అనంతరం 11.30 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం సమీపంలోని గగ్గలపల్లిలో ఉన్న తేజ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే అవగాహన సదస్సుకు హాజరవుతారు. అనంతరం 2 గంటలకు హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

మోసపూరితంగా పట్టాలు పొందితే చర్యలు..

ఇష్టారీతిగా భూ రికార్డుల్లో మార్పులు చేయడం, మోసపూరితంగా భూమి హక్కులు, పట్టాలను పొందితే వాటిని వెంటనే రద్దు చేయనున్నారు. ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూములను ఎవరైనా పట్టాలుగా పొందితే ఆ భూములన్నీ రద్దు కానున్నాయి. ఈ భూములు అన్యాక్రాంతం అయినట్టుగా అనుమానాలున్నా ప్రజలు నేరుగా సీసీఎల్ఏకు ఫిర్యాదు చేయవచ్చని భూభారతి చట్టం పేర్కొంది.

- గ్రామాల్లో ఎక్కువగా ఆబాదీ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. గ్రామకంఠం, ఆబాదీ భూముల్లో ఇళ్లు ఉన్నవారికి సరైన చట్టబద్ధమైన భూ హక్కులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్లస్థలాలు, ఆబాదీ, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులను పక్కాగా నిర్వహిస్తారు. ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో భూధార్ కార్డులను జారీ చేస్తారు. భూభారతి పోర్టల్‌లో ఉన్న హక్కుల రికార్డు ఆధారంగా తహసీల్దార్లు భూధార్ కార్డులను జారీ చేయనున్నారు.
- కొత్త రెవెన్యూచట్టంలో సాదా బైనామా దరఖాస్తులను సైతం పరిష్కరించాలని నిర్ణయించడంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో కదలిక రానుంది. ఈ దరఖాస్తుల పరిష్కారం కోసం విచారణకు రావాలని సంబంధిత ఆర్డీఓ నోటీసులు ఇస్తారు. ఆ తర్వాత దరఖాస్తుదారుడు అఫిడవిట్ సమర్పించాలి. ఆర్డీఓ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సాదాబైనామా దరఖాస్తుపై నిర్ణయం తీసుకుంటారు. వీటిలో అసైన్డ్, సీలింగ్, షెడ్యూల్ ఏరియా భూములు ఉంటే వాటిపై భూ హక్కులు ఉండవు. దరఖాస్తు సక్రమంగా తేలితే ఆర్డీఓ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం 90 రోజుల్లోగా పూర్తి కావాలని చట్టంలో నిర్దేశించారు.

నెరవేరని ‘ఉపాధి’ లక్ష్యం



అచ్చంపేట మండలం ఎద్దుమిట్టతండాలో నిర్మించిన షెడ్డు

- జిల్లాలో నత్తనడకన జీవాల షెడ్ల నిర్మాణం
- పనులు ప్రారంభించినా ముందుకు సాగని వైనం
- అవకాశాలున్నా.. అవగాహన కల్పించని అధికారులు
- పథకాలకు నోచుకోలేకపోతున్న రైతులు

అచ్చంపేట రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వగా.. ఈసారి వాటికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషిచేయాలని భావించింది. వేసవిలో జల సంరక్షణకు ఇంకుడు గుంతలు, చేపల కొలనులతోపాటు పాడి రైతుల కోసం ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

నాలుగు పశువులు ఉంటే..

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండి కనీసం నాలుగు పశువులు ఉన్నవారు షెడ్ల నిర్మాణానికి అనుమతిస్తారు. పశువుల షెడ్డుతోపాటు దాని పక్కనే తాగునీటి ట్యాంకు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక గదిని సైతం నిర్మించుకోవచ్చు. ఇప్పటి వరకు చిన్న, సన్నకారు రైతులు తమ పశువులను పొలాల వద్ద చెట్ల కింద కట్టేసేవారు. దీంతో వాటి ఆరోగ్యంపై వాతావరణ పరిస్థితులు తీవ్ర ప్రభావం చూపడంతో వ్యాధుల బారినపడేవి. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి అనుమతివ్వడంతో వారి కష్టాలు తీరనున్నాయి.

195 షెడ్ల నిర్మాణానికి..

జిల్లాలోని 20 మండలాల పరిధిలో 195 షెడ్ల నిర్మాణానికి అనుమతి రాగా.. ఇప్పటి వరకు 145 ప్రారంభించారు. అందులో కేవలం 48 మాత్రమే పూర్తిచేయగా.. మిగతా 97 ప్రగతిలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించకపోవడంతో షెడ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.84 వేల వరకు కేటాయిస్తున్నారు. నిధులు కేటాయిస్తున్నా.. రైతులకు అవగాహన లేక సద్వినియోగం చేసుకోవడం లేదు. ఫలితంగా జిల్లాలో అనుకున్న స్థాయిలో షెడ్ల నిర్మాణం జరగడం లేదు.

ఎవరూ చెప్పలేదు..



రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి. అన్ని అర్హతలు ఉన్నా సంక్షేమ ఫలాలు అందడం లేదు. ఉపాధి హామీ పథకంలో ఉన్న అనేక పథకాల గురించి ఎవరూ చెప్పడం లేదు. అర్హులైన రైతులందరికీ జీవాల షెడ్లను మంజూరు చేయాలి. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– శ్రీనివాసులు, రైతు, గోదల్, బల్మూర్ మండలం

సద్వినియోగం చేసుకోవాలి..



ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు రైతులకు షెడ్లు, ఫాం పాండ్ వంటి వాటిని మంజూరు చేస్తున్నాం. ఇప్పటికే చాలా చోట్ల రైతులకు అవగాహన కల్పించాం. అర్హులైన సన్న, చిన్నకారు రైతులు జాబ్‌కార్డు కలిగి ఉండి గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తాం.

– చిన్న ఓబులేషు, డీఆర్‌డీఓ

ఎస్‌ఎల్‌బీసీకి చేరిన టీబీఎం బేరింగ్

- అమెరికాకు చెందిన రాబిన్స్ కంపెనీ నుంచి కొనుగోలు
- పదిరోజుల్లో బేరింగ్ బిగించి నెలాఖరులో తవ్వకాలకు చర్యలు
- మన్నెవారిపల్లి అవుట్‌లెట్ నుంచి ప్రారంభం?



- వివరాలు 10లో..

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదని, వెంటనే మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ ఫైర్‌మెన్లు వహీదుద్దీన్, రంగస్వామి, ఫైర్‌మెన్లు మల్లేష్, శంకర్, వెంకటేశ్వరరావు, సిబ్బంది సైఫ్, శ్రీనివాసులు, సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

25న నో స్కాల్పెల్ వేసెక్టమీ ఆపరేషన్ శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: పురుషులకు ఎలాంటి కుట్టు కోత లేకుండా నో స్కాల్పెల్ వేసెక్టమీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రత్యేక శిబిరం ఈ నెల 25న జనరల్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ చేయించుకోదలచిన మగవారు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, సెల్ నంబర్‌తో హాజరుకావాలన్నారు. ఎలాంటి కుట్టు కోత లేకుండా, సుశిక్షితులైన ప్రత్యేక వైద్య నిపుణులతో ఆపరేషన్ ఉచితంగా నిర్వహిస్తారన్నారు. కేవలం 2 నుంచి 5 నిమిషాల్లో ఆపరేషన్ చేసి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు ఆరోగ్య కార్యకర్త హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జ్ యాదగిరి సెల్ నం.90149 32408ను సంప్రదించాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శభాజ్ మాలిక్

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆయుష్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని, దీర్ఘకాలిక రోగాలకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా నయం చేసేందుకు ఆయుష్ మందులు పనిచేస్తాయని యునాని వైద్యాధికారి శభాజ్ మాలిక్ అన్నారు. జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి మంగళవారం వరకు రక్త హీనత, పౌష్టికాహారంపై చిన్నపిల్లలు, గర్భిణులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా జనరల్ ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య చికిత్స నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ మురళీకృష్ణగౌడ్, యోగా మహిళా కార్యకర్త అంజలి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్ణాటక టు పాలమూరు!

తెలంగాణ సరిహద్దులోని మినాస్‌పూర్ అడవి నుంచి చిరుతల రాక



- నారాయణపేట జిల్లాలోని రాతిగుట్టల్లో ఆవాసం
- పర్వతాపూర్ మైసమ్మ అడవి పరిధిలో పెరిగిన సంతతి
- నీరు, ఆహారం కోసం జనావాసాల్లోకి.. ప్రజల బెంబేలు
- 9 నెలల్లో 4 మృత్యువాత.. సంరక్షణకు అటవీ శాఖ సన్నాహాలు
- పలు ప్రాంతాల్లో ట్రాక్ కెమెరాలు, బోన్ల ఏర్పాటు
- ‘నల్లమల’కు తరలించేలా అధికారుల చర్యలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కర్ణాటక నుంచి చిరుతలు పాలమూరు బాట పట్టాయి. ఆ రాష్ట్రంలోని మినాస్‌పూర్ అడవి నుంచి చిరుత పులులు భారీగా వలస వస్తున్నాయి. తెలంగాణ సరిహద్దు నారాయణపేట జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉన్న రాతిగుట్టల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లోని మైసమ్మ అడవి పరిధిలో వాటి సంతతి ఇటీవల గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. చిరుతల సంచారం, వాటి ఆవాసాలను గుర్తించిన అటవీ శాఖ అధికారులు స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గుట్టలపైకి వెళ్లొద్దని సూచిస్తున్నారు.

22 వరకు చిరుతలు..

నారాయణపేట జిల్లాలోని తరలివస్తున్న చిరుతలు మద్దూర్, కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి, ధన్వాడ, దామరగిద్ద, నారాయణపేట మండలాల పరిధిలోని పల్లెర్ల, నందిపహాడ్, మోమినాపూర్, బలభద్రాయపల్లి, ఉడ్మల్‌గిద్ద, దుప్పటిగట్టు, చెన్నారెడ్డిపల్లి, నిడ్జింత, గుండుమాల్, లక్ష్మీపూర్, కిష్టాపూర్, దామరగిద్ద తండా, సజనాపూర్, బాపన్‌పల్లి, కంసాన్‌పల్లి, బొమ్మన్‌పాడ్ తదితర గ్రామాల్లో ఉన్న రాతి గుట్టలను ఆవాసాలుగా ఏర్పాటు చేసుకున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 16 వరకు చిరుత పులులు ఉన్నట్లు అంచనా. ఇందులో ఏడాది లోపు వయసున్నవి కనీసం ఆరు వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో విస్తరించిన మైసమ్మ ఫారెస్ట్ పరిధిలో ఆరు వరకు చిరుతలు ఉన్నట్లు సమాచారం.

సుమారు 25 కి.మీ.,లు పయనించి..

కర్ణాటక రాష్ట్రంలో యాద్గిర్ ఫారెస్ట్ డివిజన్‌లో హోరంచ, అష్నాల్, ఎర్గోల, మినాస్‌పూర్ బ్లాక్‌లు ఉన్నాయి. మొత్తం 28,868.55 హెక్టార్ల పరిధిలో అడవులు విస్తరించినట్లు అటవీ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. జింకలు, దుప్పులు, ఎలుగుబంట్లు, చిరుతపులులు, పెద్దపులులకు ఆవాసంగా ఉన్న ఈ అడవిలో కొన్నేళ్లుగా చిరుతల సంతతి గణనీయంగా పెరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో నీరు, ఆహారం కోసం చిరుతలు ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మినాస్‌పూర్ బ్లాక్ నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించి నారాయణపేట జిల్లాలోకి వస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

‘నల్లమల’కు తరలిస్తున్నాం..



నారాయణపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుతల సంచారం పెరిగిన మాట వాస్తవమే. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. చిరుత సంచారాన్ని తెలుసుకునేలా మోమినాపూర్, నందిగామ, నందిపాడ్ వంటి ప్రధాన చోట్ల ట్రాక్ కెమెరాలు అమర్చాం. ఈ ప్రాంతాలతోపాటు దేవరకద్ర, ధన్వాడ ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేశాం. కొత్తపల్లి మండలం నందిగామ, ధన్వాడలో ఇప్పటివరకు రెండింటిని బంధించి నల్లమల పరిధిలోని లింగాల, అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాం. మిగతా వాటిని తరలిస్తాం. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం..

– కమాలొద్దీన్, జోగుళాంబ సర్కిల్ అటవీ రేంజ్ ఆఫీసర్

మూగజీవాలపై దాడులు.. ప్రజల బెంబేలు

నారాయణపేట జిల్లాలో గత ఏడాది డిసెంబర్ 19న గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన చింతకాయల చిన్నరాములుకు సంబంధించిన ఆవుపై చిరుత దాడి చేసి చంపింది. అదే గ్రామంలో ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీన కుర్మయ్యకు చెందిన వ్యవసాయ పొలంలో కట్టేసిన లేగ దూడపై చిరుత దాడి చేసి చంపేంది. ఈ నెల పదో తేదీన పాతారి వెంకటయ్యకు సంబంధించి రెండు మేకలు చిరుతకు చిక్కి బలయ్యాయి. అదేవిధంగా కొత్తపల్లి మండలంలోని నందిగామ, గోకుల్‌నగర్, దుప్పటిగట్టు, కొత్తపల్లి తండాల్లో ఇటీవల కాలంలో చిరుతల దాడిలో అధిక సంఖ్యలో లేగదూడలు, మేకలు, గొర్లు చనిపోయాయి. జనవరి 29న మరికల్ మండలం జిన్నారానికి చెందిన వెంకట్రాములు తన పొలం దగ్గర కట్టేసిన లేగ దూడపై దూడపై చిరుత దాడి చేసి చంపింది. ఫిబ్రవరి మూడో తేదీన పూసల్‌పాడు, మార్చి 15న ధన్వాడ మండలకేంద్రంలో, ఈ నెల రెండున, పదో తేదీన పల్లెగడ్డలో చోటుచేసుకున్న చిరుతల దాడుల్లో లేగ దూడలు మృతిచెందాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం తీగలపల్లి అటవీ ప్రాంతంలోని షేమగడ తండాలో చిరుత దాడిలో ఆవు దూడ మృతి చెందింది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. గ్రామ పరిసర ప్రాంతాల్లో చిరుతల సంచారం పెరగడం... మూగజీవాలపై వరుస దాడుల నేపథ్యంలో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.



కొత్తపల్లి మండలం నందిగామలో ఏర్పాటు చేసిన బోను

11 నెలల్లో 4 మృత్యువాత..

చిరుత వలసలు పెరిగిన క్రమంలో నారాయణపేట జిల్లాలో 11 నెలల కాలంలో నాలుగు మృతి చెందడం కలకలం సృష్టిస్తోంది. గత ఏడాది మే నాలుగో తేదీన మద్దూరు మండలం నందిగామ గ్రామ పంచాయతీ పరిధి మల్కిజాదరావుపల్లి శివారులోని పొలంలో ఓ చిరుత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అదే ఏడాది ఆగస్టు 17న అదే మండలం జాదరావుపల్లి శివారు తాటిగట్టు సమీపంలోని రాయం చెరువు వద్ద మరో చిరుత చనిపోయింది. ఈ ఏడాది జనవరి 28న దామరగిద్ద మండలం ఉడుమల్‌గిద్ద శివారులో ఉన్న గుట్టలో ఇంకొకటి, ఫిబ్రవరి 16న మద్దూరు మండలంల మోమినాపూర్ శివారులో మరొకటి మృత్యువాత పడింది. పోస్టుమార్టంలో ఇవి సహజ మరణాలేనని తేలినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో సంరక్షణకు చర్యలు చేపట్టారు.



మోమిన్‌పూర్‌లో చనిపోయిన చిరుతను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం

ఆత్మకూర్: రైలుకు ఎదురుగా వెళ్లి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గద్వాల, శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ల నడుమ చోటు చేసుకుంది. రైల్వే పోలీస్ అధికారి అశోక్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గద్వాలలోని హౌజింగ్‌బోర్డుకాలనీకి చెందిన ఏకే బాలరాజు (30) కొంతకాలంగా తాగుడుకు బానిసకావడంతో ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. తండ్రి నాగేశ్వర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు వైద్యం చేసుకోవాలని కోరగా బాలరాజు నిరాకరించి గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి అర్ధరాత్రి సమయంలో గద్వాల, శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ల నడమ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మృతదేహాన్ని గద్వాల మార్చురికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుడి దుర్మరణం


బాలరాజు (ఫైల్)

పెద్దకొత్తపల్లి: కారు, బైక్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని చంద్రకల్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని గన్యాగులకు చెందిన బాలరాజు (27), మల్లేష్ గ్రామం నుంచి మండల కేంద్రానికి వస్తుండగా కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలరాజు అక్కడికక్కడే మృతిచెందగా.. మల్లేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట అధ్యాపకుడి పని చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి..

కొత్తకోట: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన పెబ్బేరు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి కథనం మేరకు.. పెబ్బేరుకు చెందిన చెటమోని ఎల్లస్వామి (37) పొలం పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై పెబ్బేరుకు బయలుదేరాడు. రంగాపూర్ జాతీయ రహదారిపై బైపాస్ వద్దకు చేరుకోగానే హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఎల్లస్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బస్సు, బైక్ ఢీకొని మరొకరు ..


కుర్వ అంజప్ప (ఫైల్)

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామపంచాయతీ టైరోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం, బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని హైగడబండకు చెందిన కుర్వ అంజప్ప (28) తన ద్విచక్ర వాహనంపై కర్ణాటకలోని కొర్తికొండకు బయలుదేరాడు. టైరోడ్డుకు చేరుకోగానే హైదరాబాద్ నుంచి రాయచూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. వెంటనే చుట్టుపక్కల వారు అంబులెన్స్‌లో రాయచూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అంజప్పకు భార్య శంక్రమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

దుబాయ్‌లో చిక్కుకున్న పెద్దర్పల్లి యువకుడు

- చేయని నేరానికి మూడు నెలల జైలుశిక్ష
- హోల్డ్‌లో పాస్‌పోర్ట్.. స్వదేశానికి రాకుండా ఇబ్బందులు
- ఆదుకోవాలంటూ వేడుకోలు


దుబాయ్‌లో చిక్కుకుపోయిన మ్యాతరి గోపాల్

హన్వాడ: బతుకుదెరువు కోసం మధ్య దళారి ద్వారా దుబాయ్‌కి వెళ్లిన ఓ యువకుడు చిక్కుల్లో పడ్డాడు. తన గుర్తింపు కార్డుతో వేరొక మిత్రునికి మొబైల్ సిమ్ ఇప్పించిన నేరానికి అక్కడి పోలీసులు ట్రావెల్ బాండ్ కేసులో రూ.9 వేలు (దుబాయ్ రూపాయలు) జరిమానా విధించారు. ఈ డబ్బులు కట్టని నేరానికి యువకుడిని మూడు నెలల పాటు జైలుకు పంపారు. అలాగే స్వదేశానికి రాకుండా పాస్‌పోర్ట్‌ను హోల్డ్‌లో పెట్టారు. దీంతో అక్కడ చేసేందుకు పనులు దొరకక, స్వదేశానికి రాలేక తోటి కార్మికుల సాయంతో ఫోన్‌లో సందేశాలు పంపుతూ తనను ఆదుకోవాలంటూ వేడుకుంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని పెద్దర్పల్లి గ్రామానికి చెందిన మ్యాతరి గోపాల్ 2019లో బతుకుదెరువు కోసం మధ్య దళారీ ద్వారా దుబాయ్ వెళ్లాడు. నాలుగేళ్లకు ఇంటికి వచ్చి మళ్లీ దుబాయ్‌కు వెళ్లాడు. అయితే గోపాల్‌ను షార్జా విమానాశ్రయంలో తన ఐడీ కార్డు సాయంతో వేరొక మిత్రుడికి సిమ్ ఇప్పించినందుకు అక్కడి పోలీసులు దుబాయ్ రూపాయలలో రూ.9 వేల దినార్ కట్టాలని ఫైన్ వేశారు. అంత డబ్బు నేను చెల్లించలేనని చెప్పడంతో 3 నెలల జైలుశిక్ష అనుభవించాడు. తనపై ఉన్న ట్రావెల్ బాండ్ కేసును కొట్టివేయాలని అక్కడి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. పనులు దొరకక నరకం అనుభవిస్తున్న గోపాల్ స్వదేశానికి రావడానికి ప్రయత్నం చేయడంతో పాస్‌పోర్ట్‌ను హోల్డ్‌లో పెట్టారు. దీంతో యువకుడు ఇటు స్వదేశానికి రాలేక.. అటు పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నానని, తనను స్వదేశానికి రప్పించాలని స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఈ విషయమై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని యువకుడిని స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబీకులు, పెద్దర్పల్లి గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


కొడుకు రాక కోసం ఎదురుచూస్తున్న మతిస్థిమితం లేని వెంకటమ్మ

మతిస్థిమితం లేని తల్లి.. బ్లడ్ క్యాన్సర్‌తో అన్న

ఇదిలా ఉండగా.. మ్యాతరి గోపాల్ తల్లి మ్యాతరి వెంకటమ్మ మతిస్థిమితం లేక కొడుకు రాక కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తోంది. దీనికి తోడు తన అన్న మ్యాతరి కృష్ణయ్య బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో ఉన్న మ్యాతరి గోపాల్ కుటుంబాన్ని ఆదుకోవడానికి వెళ్లి చిక్కుల్లో పడ్డాడు. ఇది తెలిసిన బంధువులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి తరలింపు వేగవంతం

- 56 రోజులుగా సాగుతున్న సహాయక చర్యలు.. లభించని ఆరుగురి ఆచూకీ

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలోని ప్రమాద ప్రదేశంలో మట్టి, బురద తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రమాదం జరిగి శుక్రవారం నాటికి 56 రోజులు గడిచినా మిగిలిన ఆరుగురి ఆచూకీ లభించలేదు. డీ2 ప్రదేశంలో ఐదు ఎస్కవేటర్లతో మట్టి, బురద తవ్వి కన్వేయర్ బెల్టు ద్వారా, టీబీఎం భాగాలను కత్తిరించి శకలాలను లోకో ట్రైన్‌లో బయటకు తరలిస్తున్నారు. పైకప్పు కూలిన ప్రదేశం నుంచి వస్తున్న నీటి ఊటను భారీ మోటార్ల సాయంతో ఎప్పటికప్పుడు కృష్ణానదిలోకి పంపింగ్ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 12 రకాల సహాయక బృందాల్లోని 560 మంది సిబ్బంది నిత్యం మూడు షిఫ్ట్‌లలో సహాయక చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సహాయక చర్యలు పూర్తి చేసేందుకు సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. మరో రెండ్రోజుల్లో నిషేధిత ప్రదేశం వరకు మట్టి, శిథిలాల తొలగింపు పూర్తవుతుందని సహాయక సిబ్బంది వివరించారు.

కొనసాగుతున్న సహాయక చర్యలు..

ప్రమాదంలో చిక్కుకున్న ఆరుగురి జాడ కనుగొనేందుకు సొరంగంలోని ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. శుక్రవారం దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ వద్ద జేపీ కార్యాలయంలో సహాయక బృందాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సహాయక బృందాల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని, వారికి అవసరమైన సామగ్రి, వసతులు, పౌష్టికాహారం సమకూర్చుతున్నామని చెప్పారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజనీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.


సొరంగం లోపల కొనసాగుతున్న సహాయక చర్యలు

నిర్వాసితులను ఆదుకోవాలి


రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నాయకులు

మక్తల్: నియోజకవర్గంలోని జూరాల, సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల కింద ముంపునకు గురైన గ్రామాలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విన్నవించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఆర్‌అండ్‌ఆర్ నిర్వాసితుల సమస్యలపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు. అదే విధంగా కృష్ణానదిపై ఉన్న ఎత్తిపోతల పథకాలు ఎన్నో ఏళ్లగా పని చేయడం లేదని, కొన్నింటికి మాత్రమే మరమ్మతులు చేశామని తెలిపారు. మిగిలిన ఎత్తిపోతల పథకాల్లో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న సాగునీటి కాల్వలు పూర్తి చేస్తే మరికొన్ని ఎకరాలకు సాగునీరు అంది రైతులు అభివృద్ధి బాటలో పయనిస్తారని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, గడ్డం రమేష్, కుర్మయ్యగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీకి చేరిన టీబీఎం బేరింగ్

- మన్నెవారిపల్లి అవుట్‌లెట్ నుంచి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం వద్దకు శుక్రవారం టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)కు సంబంధించిన బేరింగ్ చేరుకుంది. అమెరికాకు చెందిన రాబిన్స్ కంపెనీ నుంచి బేరింగ్ కొనుగోలు చేసి ప్రత్యేక నౌకలో చెన్నైకి తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి ఎస్‌ఎల్‌బీసీ అవుట్‌లెట్ వద్దకు భారీ వాహనంలో తరలించారు. 2023, జనవరి 29న టీబీఎం బేరింగ్, అడాప్టర్, రింగ్‌బేర్ మరమ్మతుకు గురై అవుట్‌లెట్ నుంచి పనులు నిలిచిపోయాయి. శ్రీశైలం జలాశయం దోమలపెంట ఇన్‌లెట్ నుంచి మన్నెవారిపల్లి అవుట్‌లెట్ వరకు మొత్తం 43.93 కిలోమీటర్ల సొరంగం పనులకుగాను ఇప్పటి వరకు 34.71 కిలోమీటర్ల మేర తవ్వకం పూర్తికాగా, మరో 9.559 కి.మీ. తవ్వాల్సి ఉంది. దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ ఇన్‌లెట్ 13.936 కిలోమీటరు వద్ద ఫిబ్రవరి 22న సొరంగం పైకప్పు కూలి ఎనిమిది మంది కార్మికులు చిక్కుకోగా.. ఇద్దరి మృతదేహాలు మాత్రమే వెలికితీశారు. మరో ఆరుగురి జాడ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో ఇన్‌లెట్ వద్ద తవ్వకాలు జరిపే టీబీఎం పూర్తిగా ధ్వంసం కావడంతో ప్లాస్మా కట్టర్‌తో కత్తిరించి భాగాలను బయటకు తరలిస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన ప్రదేశాన్ని డీ1 జోన్‌గా గుర్తించారు. జీఎస్‌ఐ ఇచ్చిన నివేదిక ప్రకారం సొరంగం, కార్మికుల భద్రత దృష్ట్యా ఇక్కడ తవ్వకాలు జరపడం మంచిది కాదని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యామ్నాయంగా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం అనుసరించాలని చూస్తోంది. కేంద్ర పర్యావరణశాఖ అనుమతిస్తేనే ఈ విధానంలో పనులు చేపట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు మన్నెవారిపల్లి వైపు 20.43 కిలోమీటరు నుంచి సొరంగం తవ్వకం పనులు ప్రారంభించి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం టీబీఎం బేరింగ్, ఇతర పరికరాలు తెప్పించారు. మరో పదిరోజుల్లో బేరింగ్ బిగించి నెలాఖరులో తవ్వకాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


టన్నెల్ బోరింగ్ మిషన్‌కు బిగించే బేరింగ్ ఇదే..

బీసీల వాటా తేల్చాకే ఉద్యోగ ప్రకటనలివ్వాలి


నాగర్‌కర్నూల్‌లో జరిగిన బీసీ చైతన్య సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కందనూలు: బీసీల వాటా తేల్చాకే ఉపాధ్యాయ, ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రకటనలు ఇవ్వాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బీసీ చైతన్య సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తానంటూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. బీసీల రిజర్వేషను తేల్చకుండా నోటిఫికేషన్లు ఇస్తానంటే చూస్తూ ఊరుకోమని.. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏకమై భరతం పడతామని హెచ్చరించారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం, కుట్ర, నయవంచన చేసి పాలన సాగిస్తోందని.. ఎన్ని రోజులు సాగదని తెలిపారు. రాష్ట్రంలో 119 మంది ఎమ్మెల్యేలు ఉంటే 62 మంది అగ్రవర్ణాల వారేనని.. అలాంటప్పుడు బీసీలకు కల్యాణలక్ష్మి ఎలా చేరుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మేధావులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి..

కల్వకుర్తి రూరల్: రాజ్యాధికారం కోసం యుద్ధానికి సిద్ధం కావాలని, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనే బీసీల సత్తా ఏంటో అన్ని పార్టీలకు చూపిద్దామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. శుక్రవారం నాగర్‌కర్నూల్‌కు వెళ్తూ పట్టణంలోని బీసీ ముఖ్యనాయకులతో కాసేపు మాట్లాడారు. బీసీ వాదాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని.. 2028ని లక్ష్యంగా చేసుకొని స్థానిక ఎన్నికల్లో బీసీల పార్టీ, బీసీ గుర్తుతోనే పోటీ చేద్దామన్నారు. నల్లమల నుంచి వచ్చిన క్రూర మృగాలను తరిమి వేయాల్సిన సమయం వచ్చిందని.. 2028లో బీసీ ముఖ్యమంత్రి పాలన చేస్తారని జోస్యం చెప్పారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీల ఐక్యత చాటామని.. నియోజకవర్గానికి బలమైన బీసీ నాయకుడిని కన్వీనర్‌గా త్వరలోనే నియమిస్తామన్నారు. ఉపాధ్యాయ లోకం బీసీ ఉద్యమాన్ని విస్తృతం చేసేందుకు తమవంతు పాత్ర పోషించాలని కోరారు. బీసీ జేఏసీ నేత హరిశంకర్‌గౌడ్, జానయ్య యాదవ్, మేకల రాజేందర్, సదానందంగౌడ్, రమేష్‌చారి, రుక్కులగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, కురిమిద్దె మాజీ ఉపసర్పంచ్ విజయభాస్కర్, జమ్ముల శ్రీకాంత్, నర్సింహ, దుర్గాప్రసాద్, కరెంటు రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి కాలుష్య జలాలు

రాజాపూర్: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు.. కాలుష్య జలాలు బయటకు వదిలేందుకు పరిశ్రమల యాజమాన్యానికి అవకాశం వచ్చినట్లే. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీనిని అదునుగా చేసుకొని పోలేపల్లి సెజ్‌లో ఉన్న ఓ పరిశ్రమ వర్షపు నీటి చాటున కాలుష్య జలాలను రైతుల పొలాల్లోకి వదిలింది. రైతులు వీటి ఫొటో తీసి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. జల, వాయు కాలుష్యంతో పాటు శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని.. ఆయా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ముదిరెడ్డిపల్లి, రాయపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


రైతుల పొలాల్లోకి వదులుతున్న కాలుష్య నీరు

ఫుట్‌బాల్ క్రీడాకారుల సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న బండల వెంకట్రాములు

గద్వాలటౌన్: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటు కోరుతూ మూడేళ్ల కిందట గద్వాల క్రీడాకారులు జిల్లాకేంద్రం నుంచి మంత్రాలయం వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. గతేడాది జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటు కావడంతో మంత్రాలయం రాఘవేంద్ర స్వామికి మొక్కు చెల్లించడంలో భాగంగా శుక్రవారం సీనియర్ క్రీడాకారుడు, ఇంటిలిజెన్స్ సీఐ నర్సింహారాజు ఆధ్వర్యంలో 30 మంది క్రీడాకారులు ప్రత్యేక డ్రెస్ కోడ్‌లో స్థానిక గుంటి చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి సైకిల్ యాత్ర చేపట్టారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. శుక్రవారం స్వామివారికి మొక్కు చెల్లించి శనివారం గద్వాలకు చేరుకుంటారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, విజిలెన్స్ సీఐ విజయసింహ, మాజీ కౌన్సిలర్ బండల పాండు, సీనియర్ క్రీడాకారులు జగన్, ఇండికా శివ, జయసింహ, ప్రశాంత్, స్వామి, హరిశంకర్‌గౌడ్, విజయ్, బండల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జూరాల కాల్వలకు నిలిచిన నీటి సరఫరా

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వకు సాగునీటిని శుక్రవారం సాయంత్రం నిలిపివేశారు. ఎడమ కాల్వ పరిధిలో 20 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని గత వారమే నిలిపివేయగా.. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకోవడానికి నీటిని వదలాలని రైతులు ఆందోళనలు చేయడంతో రెండు రోజుల పాటు నీటిని విడుదల చేశారు. అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని వరి పొలాలు పొట్ట దశలో ఉన్నాయని, మరో రెండు తడులు కావాలని రైతులు డిమాండ్ చేస్తున్నా.. ప్రాజెక్టులో నిల్వ నీటిమట్టం అడుగంటిపోతుండటంతో కేవలం ఒకే తడి ఇస్తున్నట్లు ప్రకటించి నీటిని విడుదల చేశారు. ఇచ్చిన గడువు ప్రకారం శుక్రవారం కాల్వకు సాగునీటిని నిలిపివేశామని డీఈ నారాయణ, ఏఈ ఆంజనేయులు తెలిపారు.


జూరాల ఎడమ కాల్వలో నిలిచిన నీటి సరఫరా

ఊర్కొండపేట అత్యాచార ఘటన సీన్ రీ కన్‌స్ట్రక్షన్

ఊర్కొండ: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయ స్వామి దైవ దర్శనానికి వచ్చిన వివాహితపై దుండగులు అత్యాచారం చేసిన సంఘటన విదితమే. దీనికి సంబంధించి నిందితులను కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం సంఘటన స్థలానికి తీసుకువచ్చారు. మొత్తం ఏడుగురు నిందితుల్లో మారుపాకుల ఆంజనేయులు, సాధిక్ బాబా ముందుగా ఆ తర్వాత మణికంఠ, కార్తీక్‌లను సంఘటన స్థలానికి తీసుకొచ్చారు. నేరం జరిగిన తీరుపై నిందితుల నుంచి పూర్తిస్థాయిలో సమాచారాన్ని రాబట్టారు. అలాగే అత్యాచార ఘటన తర్వాత ఇంటికి ఎలా వెళ్లారన్న కోణంలో పోలీసులు గ్రామంలోని నిందితులను వారి ఇంటికి తీసుకెళ్లి విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సమక్షంలో మూడు బైకులు, సంఘటన రోజు నిందితులు ధరించిన దుస్తులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు సంఘటన స్థలంతో పాటు నిందితుల గ్రామంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పురాతన విగ్రహాల సంరక్షణ ఏది?



పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో పుష్కరఘాట్ దగ్గర బండపై పురాతన పద్మనాభుడు, వీరభద్రుడి విగ్రహాలు ఏళ్లగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. కృష్ణానదిలో మునిగిన సమయంలో వీటిని తీసుకొచ్చి ఇక్కడ ఉంచారే తప్ప నేటికి ఆలయం నిర్మించి పూజలు చేయడం లేదు. ఈ విషయాన్ని పలుమార్లు దేవాదాయశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి సంరక్షించాలని కోరుతున్నారు.

ముఖ్యమంత్రిపై అనుచిత పోస్ట్.. రిమాండ్‌కు తరలింపు

మద్దూరు: నారాయణపేట మండలం కోటకొండకు చెందిన కావలి వెంకటేష్ గత నెల 17న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోను ఎడిట్ చేసి తెలంగాణ పబ్లిక్ టీవీ, ఓ పత్రికకు చెందిన జిల్లా గ్రూప్‌లో పోస్ట్ చేశారు. మద్దూరు పుర పరిధిలోని రెనివట్లకు చెందిన కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు ఎండీ యాసిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సైదులు శుక్రవారం తెలిపారు. ఈ పోస్టు రెండువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసేలా, శాంతిభద్రతలకు భంగం వాటిల్లే ఉండటంతో వెంకటేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమాజంలో గౌరవప్రదమైన పోస్టులో ఉన్న వ్యక్తులను అవమానించే విధంగా పోస్టులు చేసినా, సోషల్ మీడియాలో మాట్లాడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సైబరు వల.. రూ.15.89 లక్షలు స్వాహా

పెబ్బేరు రూరల్: సైబర్ వలకు చిక్కి ఓ వ్యక్తి రూ.15,89,800 నగదు పోగొట్టుకున్న ఘటన పట్టణంలో శుక్రవారం వెలుగు చూసింది. పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన కొన్యాల ప్రదీప్‌చారి ఫిబ్రవరి 26న గ్యాస్ ఏజెన్సీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అతడికి ఒక ఫోన్‌కాల్ రాగా.. ఎత్తి మాట్లాడారు. మీరు గ్యాస్ ఏజెన్సీ కొరకు రిజిస్టర్ చేసుకున్నారా, ప్రాసెసింగ్ ఫీజు, ఎన్‌ఓసీ, లైసెన్స్, ప్రీ బుకింగ్ అంటూ వేర్వేరుగా పేర్లు చెప్పి ప్రదీప్‌చారి, అతడి భార్య ఖాతా నుంచి రూ.15,89,800 నగదును బదిలీ చేయించుకున్నారు. తర్వాత వారు ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

'బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి'

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేయాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నెలాఖరులోగా అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలవుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయని.. 42 శాతం బీసీ రిజర్వేషన్ సంగతి ఏమిటని, ఎందుకు బీసీల పట్ల వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకుండా నోటిఫికేషన్లు ఇస్తే రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.